13-04-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

**" మధురమైన పిల్లలారా - మీరు పురుషోత్తమ సంగమ యుగ బ్రాహ్మణులు, ఇప్పుడు మీరు ఈశ్వరుని ఒడిలోకి వచ్చారు, మీరు మనుష్యుల నుండి దేవతలుగా అవ్వాలంటే, దైవీ గుణాలు కూడా కావాలి "**

**ప్రశ్న:-** బ్రాహ్మణ పిల్లలైన మీరు ఏ విషయములో స్వయాన్ని చాలా చాలా రక్షించుకోవాలి ? ఎందుకు ?

**జవాబు:-** మొత్తం దినచర్యలో ఏ పాప కర్మలూ జరగకుండా రక్షించుకోవాలి, ఎందుకంటే మీ ఎదుట తండ్రి ధర్మరాజు రూపములో నిలబడి ఉన్నారు. ఎవ్వరికీ దుఃఖమివ్వలేదు కదా? శ్రీమతమును ఎంత శాతము అనుసరిస్తున్నాను? రావణుని మతమును అనుసరించడం లేదు కదా? అని చెక్ చేసుకోండి. ఎందుకంటే తండ్రికి చెందినవారిగా అయిన పిదప ఏ వికర్మ చేసినా అది ఒకటికి వంద(100) రెట్లుగా అవుతుంది.

**ఓంశాంతి.** భగవానువాచ - ఏ మనిషిని గానీ, దేవతను గానీ, భగవంతుడని అనరాదని పిల్లలకు అర్థం చేయించబడింది. ఇక్కడ కూర్చున్నప్పుడు మేము సంగమ యుగములోని బ్రాహ్మణులమని మీ బుద్ధిలో ఉంటుంది. ఈ స్మృతి కూడా సదా ఎవరి బుద్ధిలోనూ ఉండదు. స్వయాన్ని సత్యమైన బ్రాహ్మణులమని కూడా భావించరు. బ్రాహ్మణ పిల్లలు దైవీ గుణాలను కూడా ధారణ చేయాలి. మనము సంగమ యుగములోని బ్రాహ్మణులము, శివబాబా ద్వారా పురుషోత్తములుగా అవుతున్నాము. ఈ స్మృతి కూడా అందరికీ ఉండదు. మేము పురుషోత్తమ సంగమ యుగములోని బ్రాహ్మణులమని మాటిమాటికి మర్చిపోతారు. కనీసము ఇది బుద్ధిలో గుర్తు ఉండినా, అహో సౌభాగ్యము! సదా నంబరువారుగా ఉండనే ఉంటారు. అందరూ తమ తమ బుద్ధి అనుసారము పురుషార్థులే. ఇప్పుడు మీరు సంగమ యుగములో ఉన్నారు. పురుషోత్తములుగా అయ్యేవారు. అత్యంత ప్రియమైన తండ్రిని స్మృతి చేసినప్పుడే మనము పురుషోత్తములుగా అవుతామని మీకు తెలుసు. స్మృతి ద్వారా మాత్రమే పాపాలు నశిస్తాయి. ఇప్పుడు ఎవరైనా పాపము చేస్తే వంద రెట్లు లెక్కాచారము పెరుగుతుంది. ఇంతకు ముందు పాపము చేస్తే 10 శాతము మాత్రమే పెరిగేది. ఇప్పుడు 100 శాతము పెరుగుతుంది. ఎందుకంటే ఇప్పుడు ఈశ్వరుని ఒడిలోకి వచ్చిన తర్వాత పాపము చేస్తున్నారు కదా. పురుషోత్తముల నుండి దేవతలుగా చేసేందుకు తండ్రి మనలను చదివిస్తున్నారని పిల్లలైన మీకు తెలుసు. ఎవరికైతే ఈ స్మృతి స్థిరంగా ఉంటుందో వారు అలౌకిక సేవ కూడా చాలా చేస్తూ ఉంటారు. సదా హర్షితముఖులుగా ఉండేందుకు ఇతరులకు కూడా దారిని చూపించాలి. భలే ఎక్కడకు వెళ్ళినా బుద్ధిలో మేము సంగమ యుగములో ఉన్నామని గుర్తుండాలి. ఇది పురుషోత్తమ సంగమ యుగము. వారు పురుషోత్తమ మాసము లేక పురుషోత్తమ సంవత్సరమని అంటారు. మేము పురుషోత్తమ సంగమయుగ బ్రాహ్మణులమని మీరంటారు. ఇప్పుడు మేము పురుషోత్తములుగా అయ్యే యాత్ర చేస్తున్నామని, చాలా మంచిరీతిగా బుద్ధిలో ధారణ చేయాలి. ఇది గుర్తుంటే అది కూడా "మన్మనాభవ" అవుతుంది. మీరు పురుషార్థానుసారము చేయు కర్మల అనుసారము పురుషోత్తములుగా అవుతున్నారు. దైవీ గుణాలు కూడా ఉండాలి, శ్రీమతమును కూడా అనుసరించాల్సి వస్తుంది. మనుష్యులందరూ

తమ మతమును అనుసరిస్తున్నారు. అది రావణ మతము. అలాగని మీరందరూ శ్రీమతమును అనుసరిస్తున్నారని కాదు. చాలామంది రావణుని మతమును కూడా అనుసరిస్తున్నారు. శ్రీమతమును కొందరు కొంత శాతము, ఇంకొందరు ఇంకొంత అనుసరిస్తున్నారు. కొంతమంది రెండు శాతము మాత్రమే శ్రీమతమును అనుసరిస్తున్నారు. భలే ఇక్కడ కూర్చుని ఉన్నా శివబాబా స్మృతిలో ఉండరు. బుద్ధి యోగము ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటుంది. ఈ రోజు నేను ఏ పాపము చేయలేదు కదా? ఎవ్వరికీ దుఃఖమివ్వలేదు కదా? అని ప్రతి రోజు స్వయాన్ని పరిశీలించుకోవాలి. స్వయాన్ని చాలా రక్షించుకోవాలి. ఎందుకంటే ధర్మరాజు కూడా ఎదురుగా నిలబడి ఉన్నాడు కదా. ఇప్పుడిది లెక్కాచారమంతా చుక్తా చేసుకునే సమయము. శిక్షలు కూడా అనుభవించవలసి వస్తుంది. మేము జన్మ-జన్మాంతరాల పాపులమని పిల్లలైన మీకు తెలుసు. ఎక్కడ ఏ మందిరములోకి వెళ్లినా, ఏ గురువు వద్దకు వెళ్లినా, ఏ ఇష్టదేవత వద్దకు వెళ్లినా, మేము జన్మ-జన్మల పాపులమని, మమ్ములను రక్షించమని, దయ చూపమని వేడుకుంటారు, ప్రార్థిస్తారు. సత్యయుగములో ఎప్పుడూ ఇటువంటి పదాలు నోటి నుండి వెలువడవు. ప్రపంచములో కొంతమంది సత్యము చెప్తారు, కొంతమంది అసత్యము చెప్తారు. ఇక్కడ కూడా అలాగే ఉన్నారు. మీ జీవనగాథను వ్రాసి పంపమని బాబా ఎప్పుడూ చెప్తూనే ఉంటారు. కొంతమంది పూర్తి సత్యంగా వ్రాస్తారు, కొంతమంది సత్యమును దాచిపెడ్తారు కూడా. సిగ్గుపడ్తారు. చెడు కర్మల ఫలితము చెడుగానే ఉంటుందని అందరికీ తెలుసు. అది అల్పకాలిక విషయము. ఇది చాలాకాలానికి చెందినది. ఇప్పుడు చెడు కర్మలు చేస్తే శిక్షలనుభవించడమే కాక స్వర్గములోకి కూడా చాలా ఆలస్యంగా చివర్లో వస్తారు. ఎవరెవరు పురుషోత్తములుగా అవుతారో ఇప్పుడు స్పష్టంగా తెలిసిపోతుంది. అది పురుషోత్తమ దైవీ రాజ్యము. ఉత్తమోత్తమ పురుషులుగా అవుతారు కదా. ఇక్కడ తప్ప వేరెక్కడా ఎవ్వరినీ ఇలా మహిమ చేయరు. మనుష్యులకు దేవతల గుణములేవో కూడా తెలియదు. భలే మహిమ చేస్తారు కానీ చిలుక వలె అర్థము తెలియకుండా చేస్తారు(చిలుక పలుకులు). కనుక భక్తులకు కూడా అర్థం చేయించమని బాబా చెప్తారు. భక్తులు స్వయాన్ని నీచులమని, పాపులమని చెప్పుకుంటారు. అప్పుడు వారిని - "మీరు శాంతిధామములో ఉన్నప్పుడు అక్కడ పాపము చేస్తూ ఉండినారా?" అని అడగండి. అక్కడ ఆత్మలన్నీ పవిత్రంగా ఉంటాయి. ఇది తమోప్రధాన ప్రపంచమైనందున ఆత్మ అపవిత్రమైపోయింది. నూతన ప్రపంచములో అయితే పవిత్రంగా ఉంటాయి. అపవిత్రంగా చేసేది రావణుడు.

ఈ సమయంలో ముఖ్యంగా భారతదేశము పై సాధారణంగా ప్రపంచమంతటి పై రావణ రాజ్యముంది. యథా రాజా రాణి తథా ప్రజా(రాజు, రాణి ఎలా ఉంటారో ప్రజలు కూడా అలాగే ఉంటారు) అత్యంత ఉన్నతము(స్వర్గము), అత్యంత నీచము(నరకము, కలియుగము). ఇక్కడ అందరూ పతితులుగానే ఉన్నారు. బాబా చెప్తున్నారు - నేను మిమ్ములను పావనంగా చేసి వెళ్తాను, తర్వాత మిమ్ములను పతితంగా ఎవరు చేస్తారు? రావణుడు. ఇప్పుడు మీరు మా మతమును అనుసరించి మళ్లీ పావనంగా అవుతున్నారు. అర్ధకల్పము తర్వాత మళ్లీ రావణ మతము అనుసరించి పతితులుగా అవుతారు అనగా దేహాభిమానులుగా అయి వికారాలకు వశమైపోతారు. దానిని ఆసురీ మతమని అంటారు. భారతదేశము ఏదైతే పావనంగా ఉండేదో, అదే ఇప్పుడు పతితమై పోయింది. ఇప్పుడు మళ్లీ పావనంగా అవ్వాలి. పావనంగా చేసేందుకు పతితపావనుడైన తండ్రి

రావలసి వస్తుంది. ఇప్పుడు ఎంతమంది మనుష్యులున్నారో చూడండి! రేపటి రోజు ఎంతమంది మనుష్యులుంటారు! యుద్ధము జరుగుతుంది, మృత్యువు మీ ఎదుటే నిలబడి ఉంది. అయితే రేపు ఈ మనుష్యులంతా ఏమవుతారు? ఎక్కడికెళ్తారు? అందరి శరీరాలు, ఈ పాత ప్రపంచము వినాశమైపోతాయి. ఈ రహస్యము ఇప్పుడు మీ బుద్ధిలో ఉంది అయితే నంబరువారు పురుషార్థానుసారంగా ఉంది. ఇప్పుడు మనము ఎవరి ముందు కూర్చొని ఉన్నామో కూడా చాలా మంది అర్థము చేసుకోరు. వారు అత్యంత కనిష్ఠ పదవిని పొందుకుంటారు. డ్రామానుసారము అంతకంటే ఎక్కువ చేయలేరు, వారి భాగ్యములో ఉండదు. ఇప్పుడు పిల్లలైన మీరు సర్వీసు చేయాలి, తండ్రిని స్మృతి చేయాలి. మీరు సంగమ యుగములోని బ్రాహ్మణులు, మీరు తండ్రి సమానము జ్ఞాన సాగరులు, సుఖ సాగరులుగా అవ్వాలి. తయారు చేసే తండ్రి లభించారు కదా. దేవతలను సర్వగుణ సంపన్నము...... అని మహిమ చేస్తారు. ఇప్పుడు ఈ గుణాలు గలవారు ఎవ్వరూ లేరు. మేము ఉన్నతపదవి పొందుకునేందుకు ఎంతవరకు అర్హులయ్యాము? అని స్వయాన్ని సదా ప్రశ్నించుకుంటూ ఉండండి. సంగమ యుగాన్ని బాగా స్మృతి చేయండి. సంగమ యుగములోని బ్రాహ్మణులైన మనము పురుషోత్తములుగా అయ్యేవారము. శ్రీ కృష్ణుడు నూతన ప్రపంచములోని పురుషోత్తముడు కదా. మనము బాబా ముందు కూర్చొని ఉన్నామని పిల్లలకు తెలుసు. కనుక ఇంకా ఎక్కువగా చదువుకోవాలి. ఇతరులను చదివించాలి కూడా. చదివించలేదంటే, చదవలేదని ఋజువు అవుతుంది. ఎంత చెప్పినా బుద్ధిలో కూర్చోదు. 5 శాతము(నూటికి 5 భాగాలు) కూడా కూర్చోదు. మనము సంగమ యుగములోని బ్రాహ్మణులమని కూడా గుర్తుండదు. బుద్ధిలో తండ్రి గుర్తుండాలి. చక్రము తిరుగుతూ ఉండాలి. జ్ఞానము(తెలిపించుట) చాలా సులభము. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయాలి. వారు అందరికంటే గొప్ప తండ్రి. నన్ను స్మృతి చేస్తే మీ వికర్మలు వినాశనమవుతాయని తండ్రి చెప్తున్నారు. మనమే పూజ్యులము, మనమే పూజారులము - ఇది చాలా మంచి మంత్రము. అయితే వారు 'ఆత్మనే పరమాత్మ' అని అనేశారు. వారు చెప్పేదంతా పూర్తిగా తప్పు. మనము పవిత్రంగా ఉండేవారము. 84 జన్మల చక్రములో తిరిగి ఇప్పుడిలా అయ్యాము. ఇప్పుడు మనము వాపస్ ఇంటికి వెళ్తాము. ఈ రోజు ఇక్కడున్నాము. రేపు ఇంటికి వెళ్తాము. మనము బేహద్(అనంతమైన) తండ్రి ఇంటికి వెళ్తాము. ఇది అనంతమైన నాటకము. ఈ నాటకము రిపీట్ అవుతుంది. తండ్రి చెప్తున్నారు - దేహ సహితము, దేహ సర్వ ధర్మాలను మరచి స్వయాన్ని ఆత్మగా భావించండి. ఇప్పుడు మనము ఈ శరీరాలను వదిలి ఇంటికి వెళ్ళిపోతాము. ఈ విషయాన్ని బుద్ధిలో పక్కాగా గుర్తుంచుకోండి. మనమంతా ఆత్మలమని, మన ఇల్లు కూడా గుర్తుంటే, బుద్ధి నుండి ఈ ప్రపంచమంతా సన్యసింపబడినట్లే. శరీరాన్ని కూడా సన్యసిస్తారు. కనుక సర్వస్వమూ సన్యసించినట్లే. ఆ హఠయోగులెవ్వరూ, ఈ సృష్టినంతటినీ సన్యసించరు. వారిది అసంపూర్ణమైన సన్యాసము. మీరు ఈ మొత్తం ప్రపంచాన్ని త్యాగము చేయాల్సి వస్తుంది. స్వయాన్ని దేహంగా భావిస్తే, పనులు కూడా అలాంటివే చేస్తారు. దేహాభిమానులుగా అవ్వడం వలన దొంగతనము, అసత్యము చెప్పుట, పాపము చేయుట,............ వీటన్నిటికీ అలవాటు పడిపోతారు. బిగ్గరగా మాట్లాడడం కూడా అలవాటైపోతుంది. అలా మాట్లాడుతూ నా గొంతే(మాటే) అంత అని అంటారు. పగటి పూట 25 - 30 పాపాలు కూడా చేస్తారు. అసత్యము చెప్పడం కూడా పాపమే కదా, అలవాటైపోతుంది.

బాబా చెప్తున్నారు - మెల్లగా మాట్లాడడం నేర్చుకోండి. శబ్దము తగ్గించుకునేందుకు ఆలస్యమేమీ కాదు. కుక్కలను పెంచుకుంటే కూడా అవి మంచిగా అవుతాయి. కోతులకు ఎంత కోపముంటుంది! అయినా అలవాటు చేయిస్తే డాన్సు మొదలైనవి కూడా చేస్తాయి. జంతువులు కూడా సంస్కరింపబడ్తాయి. జంతువులను సంస్కరించేవారు మనుష్యులు. మనుష్యులను సంస్కరించేవారు తండ్రి. ఆ తండ్రి చెప్తున్నారు - మీరు కూడా జంతువుల వలె ఉన్నారు కనుక నన్ను కూడా తాబేలుగా (కూర్మావతారము), పంది(వరాహావతారము)గా అవతరించానని అంటారు. మీ కంటే నన్ను నీచంగా చేసేశారు. ఈ విషయాలు కూడా మీకు మాత్రమే తెలుసు. ప్రపంచములోని వారికి తెలియదు. చివరిలో మీకు సాక్షాత్కారమవుతుంది. ఎటువంటి శిక్షలను అనుభవిస్తారో అది కూడా మీకు తెలిసిపోతుంది. అర్ధకల్పము భక్తి చేశారు, ఇప్పుడు తండ్రి లభించారు. తండ్రి చెప్తున్నారు - నా మతమును అనుసరించకపోతే శిక్షలు ఇంకా పెరుగుతూ ఉంటాయి. ఇప్పుడు పాపాలు మొదలైనవి చేయడం మానండి. చార్టు వ్రాయండి. దానితో పాటు ధారణ కూడా చేయాలి. ఎవరికైనా అర్థం చేయించే అభ్యాసము కూడా చేయండి. ప్రదర్శనీ చిత్రాల పై గమనముంచండి. ఎవరికి ఎలా అర్థం చేయించాలో ఆలోచించండి. మొట్టమొదట గీతా భగవానుడు ఎవరు? అను మాటతో ప్రారంభించండి. పతితపావనుడైన పరమపిత పరమాత్మయే జ్ఞానసాగరుడు కదా. ఈ తండ్రియే సర్వాత్మలకు తండ్రి కనుక ఆ తండ్రి పరిచయము కావాలి కదా. ఋషులు - మునులు మొదలైన వారెవ్వరికీ తండ్రి పరిచయమూ లేదు, వారి రచనల ఆది-మధ్యాంతాల గురించి కూడా తెలియదు. కనుక మొట్టమొదట భగవంతుడు ఎవరో అర్థము చేయించి వారిచే భగవంతుడు ఒక్కరే అని వ్రాయించండి. ఇతరులెవ్వరూ భగవంతుడయ్యేందుకు వీలు లేదు. మనుష్యులు స్వయాన్ని భగవంతుడని పిలిపించుకోరాదు.

భగవంతుడు నిరాకారుడని పిల్లలైన మీకిప్పుడు నిశ్చయముంది. తండ్రి మనలను చదివిస్తున్నారు, మనము విద్యార్థులము. వారు తండ్రే కాక మనకు టీచరు, సద్గురువు కూడా. ఒక్క తండ్రిని స్మృతి చేస్తే టీచరు, గురువు ఇరువురూ కూడా గుర్తుకు వస్తారు. బుద్ధి అటు-ఇటు భ్రమించరాదు. కేవలం శివుడు అని కూడా అనరాదు. శివుడు మన తండ్రే కాక సుప్రీమ్ టీచరు కూడా అయ్యారు. మనలను వారి వెంట తీసుకెళ్తారు. మహిమ అంతా వారొక్కరిదే. వారినే స్మృతి చేయాలి. ఇతను వెళ్ళి బి.కెలను గురువులుగా చేసుకున్నాడని అంటారు. మీరు గురువులుగా అయితే అవుతారు కదా. అయితే మిమ్మలను తండ్రి అని అనరు. టీచరు, గురువు అని అంటారు కానీ తండ్రి అని అనరు. ఆ తండ్రిని ఒక్కరినే మూడు సంబంధాలతో పిలుస్తారు. వారు అందరికంటే గొప్ప తండ్రి. వీరి(త్రిమూర్తుల) పైన కూడా ఆ తండ్రే ఉన్నారు. ఇది మంచిరీతిగా అర్థము చేయించాలి. ప్రదర్శనీలో అర్థం చేయించే వివేకము ఉండాలి. కానీ కొంతమందికి అంత ధైర్యము ఉండదు. పెద్ద - పెద్ద ప్రదర్శనీలు జరిగితే మంచి సేవాధారులైన వారు వెళ్ళి సర్వీసు చేయాలి. బాబా వెళ్ళవద్దు అని చెప్పరు. పోను పోను సాధు-సత్పురుషులు మొదలైనవారికి కూడా మీరు జ్ఞాన బాణము వేస్తూ ఉంటారు. ఎక్కడికి వెళ్తారు? ఉండేది ఇది ఒక్క దుకాణమే(ఏక్ హీ హట్టీ హై). ఈ దుకాణము ద్వారా అందరికీ సద్గతి జరగాలి. ఈ దుకాణము ఎటువంటిదంటే మీరు దీని ద్వారా అందరికీ పవిత్రంగా అయ్యేందుకు దారి తెలుపుతారు. వారు పవిత్రమవ్వనీ, కాకపోనీ అది వారి ఇష్టము.

పిల్లలైన మీ గమనము విశేషంగా సేవ పై ఉండాలి. భలే పిల్లలు వివేకవంతులుగా ఉన్నారు. కానీ సేవ పూర్తిగా చేయకుంటే, వీరి పై రాహు దశ కూర్చుందని తండ్రి భావిస్తారు. అందరి దశలు తిరుగుతూ ఉంటాయి కదా. మాయ నీడ వారి పై పడ్తుంది. మళ్లీ రెండు రోజుల తర్వాత బాగైపోతారు. పిల్లలు సేవ చేసే అనుభవము పొంది రావాలి. ప్రదర్శనీలైతే చేస్తూనే ఉంటారు. గీతను గానము చేసింది శివ భగవానుడని, కృష్ణుడు కాదని మనుష్యులు ఎందుకు వెంటనే వ్రాయరు? కొంతమంది ఇది చాలా బాగుంది, మనుష్యులకు చాలా కళ్యాణకరమని అందరికీ ఈ ప్రదర్శనీని చూపించాలని అంటారు. కానీ నేను కూడా వచ్చి ఈ వారసత్వము తీసుకుంటాను,.......... అని ఎవ్వరూ చెప్పరు. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. దేహాభిమానానికి వశమై బిగ్గరగా మాట్లాడరాదు. ఈ అలవాటును వదిలేయాలి(తుడిచి వేయాలి). దొంగతనము చేయడం, అసత్యము చెప్పడం,.......... ఇవన్నీ పాపాలు. వీటి నుండి రక్షించుకునేందుకు దేహీ - అభిమానులుగా అయి ఉండాలి.
2. మృత్యువు మీ ఎదుటనే నిల్చొని ఉంది. అందువలన తండ్రి శ్రీమతమును అనుసరిస్తూ పావనంగా అవ్వాలి. తండ్రికి చెందినవారిగా అయిన తర్వాత ఎలాంటి చెడు కర్మలు చేయరాదు. శిక్షల నుండి తప్పించుకొను పురుషార్థము చేయాలి.

## వరదానము :- “స్మృతి బలముతో మీ పురుషార్థ వేగాన్ని మరియు ఇతరుల శ్రేష్ఠ పురుషార్థ గతి విధులను తెలుసుకునే మాస్టర్ త్రికాలదర్శి భవ ”

ఎలాగైతే సైన్సు వారు భూమి నుండి స్పేస్‌లోకి వెళ్లేవారి ప్రతి గతిని, విధిని తెలుసుకోగలరో అలా త్రికాలదర్శి పిల్లలైన మీరు సైలెన్స్ అనగా స్మృతి బలముతో తమ లేక ఇతరుల శ్రేష్ఠ పురుషార్థము లేక స్థితుల గతి విధులను స్పష్టంగా తెలుసుకోగలరు. బుద్ధి దివ్యంగా అయినందున స్మృతి యొక్క శుద్ధసంకల్పాలలో స్థితమైనందున ‘త్రికాలదర్శి భవ’ అను వరదానము ప్రాప్తి అవుతుంది. అంతేకాక కొత్త కొత్త ప్లాన్లు ప్రాక్టికల్‌లోకి తీసుకొచ్చేందుకు స్వతహాగా ఎమర్జ్ అవుతారు.

## స్లోగన్ :– “ సర్వుల సహయోగులుగా అయితే స్నేహము స్వతహాగా ప్రాప్తి అవుతూ ఉంటుంది. ”